## "నమస్తేసార్"
## "నమస్తే..." డీవో లెటర్ రాయడం ఆపి తలెత్తిచూశాను.
## రాందాసుగారు.
## "మీరా కూర్చోండి..." అన్నాను.
## "థ్యాంక్స్‌సార్" అంటూ రాందాసుగారు రెండు చేతుల్లో ఉన్న పెద్దపెద్ద సంచులను కిందకి దింపుతూ కూర్చున్నారు.

ఏమాత్రం ప్రాముఖ్యంలేని ఒకానొక గవర్నమెంటు ఆఫీసులోని అసలెవరికి అవసరంలేని ఒకానొక సెక్షన్‌లో పని చేస్తున్నాను నేను.

నగరంలోని మెయిన్ సెంటర్‌లో కట్టబడిన గవర్నమెంటు ఆఫీసుల కాంప్లెక్సులో ఒక భవనపు మూడో అంతస్తులో వుంది మా ఆఫీసు. పేరుకి లిఫ్టున్నా ప్రారంభోత్సవం నాడు తప్ప మళ్ళీ అది పనిచేయడం నేను కళ్ళతోచూడలేదు. కిటికీ లోంచిబైటకి చూశాను.

ఎండ పేట్రేగిపోతోంది.

రాందాసుగారు జేబులోంచి రుమాలు తీసి నుదుటికి పట్టిన చెమటని తుడుచుకుంటున్నారు.

పిలిచినప్పుడు కనపడ్డని తెలిసికూడా,మా ప్యూన్ సోముల్ని పిలిచాను.

"యస్సార్" అన్న కేక వినిపించింది. అంటే మా ఫ్లోర్లోనే వున్నాడన్నమాట.కానీ రాడు.

అలమారాలోంచి నా టిఫిన్ బాగు తీసి అందులోంచిమంచినీళ్ళబాటిల్, గ్లాసు తీసి రాందాసు గారి ముందర పెట్టాను.

అయన ఏం ఆలోచించకుండా బాటిల్‌మూత తీసి గ్లాసుతో అవసరం లేకుండానే బాటిల్ ఎత్తి గడగడా నీళ్ళు తాగారు.

"థ్యాంక్స్ అండి" రుమాలుతో మూతి తుడుచుకుంటూ చెప్పారు.

పెళ్ళుమంటున్న ఇలాంటి ఎండలోకూడా అంతంత బరువులు మోసుకుంటూ ఇలా అంతస్తు లెక్కిదిగడం ఎందుకో నాకు తెలుసు. ·

కానీ నేను మాత్రం ఏం చెయ్యగలను?

క్రిందపెట్టిన సంచీల్లోంచి చెరోప్యాకెట్టు తీసి నా ముందు పెట్టారు రాందాసుగారు.

ఒకపాకెట్లో నాకిష్టమైన కాకినాడకాజా.

మరోదాంట్లో మిక్చర్.

"ఏమిటోనండి. రెక్కలు ముక్కలయ్యేలా ఇలాస్వీట్లు హాట్లు చెయ్యడమే గాని మునుపటిలా ఎవరూ తీసుకోవడం లేదండి. పెట్టుబడిపైన బొటాబొటీగా మిగిలే నాలుగు డబ్బుల్తో గంపడంత సంసారాన్ని లాక్కురావడం నిజంగా నరకమేనండి" రాందాసుగారు మామూలుగానే చెప్పుకుపోతున్నారు. రాందాసు గారి కుటుంబంలో ఒకప్పుడు బాగా బతికేవాళ్ళేనట. తెండ్రి హటాంలో ఖర్చుపెట్టగా మిగిలింది ఈయన చేతికొచ్చేసరికి చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు తమ్ముళ్ళ చదువులు తనకుటుంబం బరువుబాధ్యతలు కళ్ళముందు కనపడ్డాయట. బరువులన్నీ దింపుకునేసరికి బాధ్యతలు బంధాలు బతుకుని బందీచేశాయిట.

సరదాగా నేర్చుకున్న 'కుకింగ్' నే ఉపాధిగా మార్చుకోవాల్సి వచ్చిందట.

"వచ్చే పండక్కి ఏమన్నా స్పెషల్ ఆర్డర్లు దొరుకుతాయేమోనని"రాందాసుగారు ఆగారు.

నిజానికి మా ఆఫీసులోవాళ్ళు వో పట్టుపట్టారంటే రాందాసుగారికి మంచి బేరమే తగుల్తుంది.

కాని

మా స్టాఫు గురించి నాకు బాగా తెలుసు.

రాందాసుగారు పరిచయమైన కొత్తలో నేనే స్వయంగా ప్రతిసెక్షన్‌కి తీసుకెళ్ళి ఆయన పట్టుకొచ్చిన స్వీట్లు హాట్లు అమ్మించే వాడిని.

మొదట్లో కొన్నాళ్ళు బాగానే గడిచింది.

ఆతర్వాతే ఒకసారి—

మావాళ్ళు రాందాసుగారిని 'శాంపిల్'గా పెట్టమంటూ అంతా తలో ముక్కతీసుకుని రెండు కేజీలస్వీట్సు తినేశారు. దానికి డబ్బెవరిస్తారు?

అదంతా రాందాసుగారికి నష్టమే.

పైగాశాంపిల్ తింటేగాని కొనమని మావాళ్ళు ఆశపెట్టారు.

దాంతో రాందాసుగారు మెత్తబడ్డారు.

శాంపిల్స్ చాలా మందే తిన్నారు గాని కొన్నవాళ్ళు మాత్రం చాలా తక్కువ మంది.

ఆతర్వాత రాందాసుగారు ఎప్పుడొచ్చినా తెచ్చిన దాంట్లో సగం శాంపిల్స్ కే సరిపోయేది. ఇదంతానష్టమే. అంతేకాదు. మా వాళ్ళంతా నన్ను రాందాసుగారికి ఏజెంటుని చేసేశారు. కమీషన్ తింటున్నానని నా వెనకాల పుకార్లు మొదలెట్టారు. దాంతో మనసు విరిగిపోయింది. మానవతా ధర్మంతో ఒకమనిషికి సాయం చేయాలంటే ఇన్ని ఇబ్బందులుంటాయని నాకు నిజంగా తెలియదు. రాందాసుగారికివేమీ తెలియవు.

నేనూ చెప్పలేదు.

అందుకే ఆయన వచ్చినప్పుడల్లా ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకునేవాడిని. ఆయన చేసే వస్తువుల్లో రుచీ, శుచీ నాకు తెలుసు కాబట్టి నేను మాత్రం ఒకటికి రెండుపాకెట్లు కొనేవాడిని. నాలా ఉండేమరో నలుగురైదుగురు దగ్గరికి తీసుకెళ్ళి అమ్మించేవాడిని. దానికి కూడా మావాళ్ళు పేర్లు పెట్టారు.

"నాకు కమీషన్ తక్కువైందని, అందుకే అలా చేస్తున్నానని" ఛీఛీ ఏం మనుషులో?

దానికితోడు రాందాసుగారు హంగు, ఆర్భాటం లేని మనిషి. నోరువిప్పి గట్టిగా మాట్లాడలేనీ మనిషి. మాసిన గడ్డంతో, మాసిన సంచీలతో జిడ్డుగా ఉండేపాకెట్లతో అసలామనిషి ఉనికే తయారుచేసిన పదార్థాలలో ఉండేరుచిని తెలియచేయనివ్వడం లేదంటే ఆశ్చర్యంకాదు నిజం

రాందాసుగారు చేసిన స్వీట్‌గాని, హాట్ గాని ఒక్కసారి తింటే వదలాలనిపించదు.

ఆయన చేతుల్లో ఏముందో గాని, అన్ని రకాల తినుబండారాల్లోను రుచి మాత్రం అమృత తుల్యంగా ఉండేది. స్వీట్లకు.హాట్లకు గిరాకీ లేదని కొన్నాళ్ళు రాందాసుగారు వడియాలు, అప్పడాలు,రకరకాల పచ్చళ్ళు పొడాలు తీసుకొచ్చేవారు.

వాటి విషయంలోనూ అంతే జరిగింది.

శాంపిల్స్, నా కమీషన్ ఇంకాముందుకెళ్ళి ఇది నా 'సైడ్ బిజినెస్' అని అంటగట్టారు.

గిరాకీల్లేవనో, మరోకారణం చేతో రాందాసు గారు చాలా రోజులవరకు కన్పడలేదు.

మళ్ళీ ఇప్పుడు రావడమే.

"ఏమిటి బాబు. ఆలోచనలోపడ్డారు" రాందాసుగారు అడిగారు.

"ఏం లేదండి.. ఇంకో రెండు పాకెట్లు స్వీట్లు, ఒకపాకెట్టు మిక్చర్ ఇవ్వండి" అంటూ పర్సులోంచి డబ్బులు తీసి ఇచ్చాను.

టేబిల్ మీదున్న రెండుపాకెట్లు తీసి మిగతా పాకెట్లతోపాటు మరో ప్లాస్టిక్ కవర్‌లో వేసి నా ముందు పెట్టారు రాందాసుగారు.

"మరి స్పెషల్ ఆర్డర్ల గురించి" ఆగారాయన.

"మీరేమీ అనుకోకపోతే మీకు ఆఫీసంతా తెలుసుగా. మీరే వెడితే సరిపోతుంది. అంటే ఏంలేదు నాకు కాస్త అర్జెంటు పని ఉందండి." టక్కున అబద్ధం చెప్పాను రాందాసుగారు ఏమనుకున్నారో ఏమో.

మంచిది సార్. వెళ్ళొస్తాను" అంటూ బతుకు 'బరువు'ని మోసుకుంటూ వెళ్ళిపోయారు.

ఆతర్వాతేం జరిగిందో నేను ప్రత్యక్షంగా చూడకపోయినా ఊహించగలను.

కారణం —రాందాసుగారు మళ్ళీ మా ఆఫీసులో కనిపించలేదు.

★ ★ ★

"నమస్తే సార్..."

అలవాటైన గొంతులా అనిపించి తలెత్తాను.

ఎదురుగా మా సెక్షన్ ప్యూన్ సోములు పక్కనే మరోశాల్తీ.

ఇన్‌షర్ట్ వేసి బాగీ ఫాంటులో మోడ్రన్‌గా కనిపిస్తున్నాడు. ఏమిటి అని అడగకుండానే చెప్పడం మొదలెట్టాడు సోములు.

"ఈడు నా బామ్మర్దిగాడండి. పేరు మల్లేసమండి. ఈ వూరే నండి... ఈడీమధ్య కొత్తగా బిజినెస్సు పెట్టాడండి. మన ఆఫీసంతా హెల్ప్ చేత్తన్నారండి. తమరుకూడా" అంటూ తనబావమరిది ని ముందుకు తోసి సోములు పళ్ళికిలిస్తూ పక్కన నుంచున్నాడు.

# మెట్లు



– ఆకెళ్ళ సూర్యనారాయణమూర్తి

"గుడ్‌మార్నింగ్‌సార్. ఐయామ్ మల్లేషం" అంటూ చేతిని ముందుకు చాస్తూ విజిటింగ్ కార్డు అందించాడు భుజానికున్న సంచిలోంచి ఓ పాంప్లెట్ తీసి నా ముందు పెట్టాడు.

చూశాను.

మల్లేష్ తన దగ్గరున్న కొద్దిపాటి పెట్టుబడి పెట్టి ఈ వ్యాపారం మొదలెట్టాట్ట.

"మరి శాంపిల్స్ ఏమన్నా ఉంటే " అంటూ ఆగాను.

"భలేవారుసార్. నేను చెప్తున్నా గదా. మీకేం తేడా రాదు. అయినా ఇందులో ఏముందిసార్. " అని మల్లేష్ కేసి తిరిగి నన్ను చూపెడుతూ.

"ఈసార్ మస్తుస్వీట్లు హాట్లు కొంటాడు. నాకు బాగా ఎరికె. సార్ బోణి మంచిది. ఒకకేజి స్వీట్ రాసుకో" అంటూ నేనుచెప్పేది వినిపించుకోకుండా సోములు మల్లేష్‌తో సహా పక్క టేబిల్ దగ్గరి కెళ్ళిపోయాడు.

డబ్బుకాస్త ఎక్కువైందని పించినా మల్లేష్ తెచ్చిన స్వీట్స్ హాట్స్ నిజానికి చాలా రుచిగా ఉన్నాయి. అయితే నో శాంపిల్స్, నో క్రెడిట్స్ నో కామెంట్స్ సోములు తన మాటలతో దడదడలాడించి స్టాఫందరి చేత తన బావ మరిది తెచ్చిన స్వీట్లు, హాట్లు అమ్మించేశాడు.

మల్లేష్ కూడా నెలకి రెండుసార్లు వస్తూ తన బిజినెస్ బాగానే వృద్ధిచేసుకున్నాడు. నీట్‌గా ప్యాక్‌చేసి పట్టుకురావడమే కాకుండా తినడానికి రుచిగా కూడా ఉండడంతో మల్లేష్ బిజినెస్ బాగా పెరిగింది.

★★★

ఏడాది తరువాత

ఓరోజు సోములు, మల్లేష్ యధాప్రకారం నా దగ్గరికి వచ్చారు.

సోములేదో చెబుతుంటే మల్లేష్ చేతిలో ఉన్న కార్డుల కట్టలోంచి ఒక కార్డుతీసి నా పేరు రాసి ఇచ్చాడు. కవర్ తీసి చూశాను.

నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను.

మా ఆఫీసులోనే కాకుండా కాంప్లెక్సులోని మిగతా ఆఫీసుల్లో కూడా హోంఫుడ్స్ సప్లయి చేస్తూ బాగా లాభం సంపాదించాట్ట మల్లేష్.

వచ్చిన లాభంతో నగరంలోని మెయిన్ సెంటరులో కొత్తగా స్వీట్లషాపు పెడుతున్నాడు.

దాని ప్రారంభోత్సవానికే ఈ ఆహ్వానం.

"మీరు తప్పకుండా రావాలి సార్.. మీరంతా బోణి చేస్తే నాకు సంతోషంగా ఉంటుంది" వినయంగా చెప్పాడు మల్లేష్.

చూస్తుండగానే ఎలా ఎదిగిపోయాడు.

"తప్పకుండా మల్లేష్... నువ్వింత ఇదిగా చెబుతుంటే కాదంటానా.. రేపు సాయంత్రమేగా ఫంక్షన్" అంటూ శుభాకాంక్షలు చెబుతూ చేయి కలిపాను.

★★★

"నమస్తే సార్"

సోములు,మల్లేష్ ఎదురొచ్చి మరీ ఆహ్వానించారు.

"కంగ్రాచ్యులేషన్స్ మల్లేష్" సంతోషంగా భుజం కలిపాను.

అప్పటికే మాస్టాఫులో చాలా మంది షాపు ముందు వేసిన షామియానాలో చేరి ముచ్చటలాడుకుంటున్నారు..

"రండిసార్ షాపు చూద్దురుగానీ"

మల్లేష్ తీసుకెళ్ళాడు. చాలాపెద్ద షాపు. షాపువెనకాలే కిచెన్ రూం ఉంది. అక్కడే స్వీట్లు హాట్లు తయారు చేస్తున్నారు. పని వాళ్ళంతా యూనిఫామ్‌లో ఉన్నారు.

ఈలోగా మల్లేష్ ఎవరినో పిలిచి నాకోసం ఏదో తెమ్మని చెప్పాడు.

"తీసుకోండి సార్.. మల్లేష్ నా చేతిలో పెట్టిన ప్లేటు కేసి చూశాను.

నా కిష్టమైన కాకినాడ కాజా, కాస్తమిక్చర్.

"థ్యాంక్స్ మల్లేష్" కాజానోట్లో పెట్టుకుంటూ చెప్పాను.

"ఇతనేసార్. మా కిచెన్ రూం హెడ్"

మల్లేష్ మాటలు వినిపించడం మానేశాయి.

కళ్ళు నులుముకిని చూశాను. సందేహం లేదు.

తళతళలాడుతున్న యూనిఫామ్‌లో రాందాసుగారు.

"నమస్తేసార్"

నన్ను గుర్తు పట్టారో లేదా గాని రాందాసు గారు వేగంగా అక్కడినుంచి వెళ్ళిపోయారు.

"బాగా చేస్తాడుసార్ స్వీట్లు, అందుకే పనిలో పెట్టుకున్నాను"

మల్లేష్ ఏదో చెబుతుండగానే బైటకి వచ్చేశాను.

చేతిలో ఉన్న ప్లేటులో సగం తిన్న కాజా ముక్క, మిక్చర్ అలాగే ఉన్నాయి. ●